క్లుప్తంగా

సబ్‌జైలుకు టీవీ వితరణ



సబ్‌జైలుకు టీవీ అందిస్తున్న డాక్టర్ రామ్మోహన్

పీలేరు రూరల్ : స్థానిక సబ్ జైలుకు పీలేరు పట్టణానికి సాయి దంతవైద్యశాల నిర్వాహకులు ప్రముఖ దంతవైద్య నిపుణులు డాక్టర్ రామ్మోహన్ అన్నారు. మంగళవారం సబ్ జైల్ సూపరింటెండెంట్ కె. చంద్రశేఖర్‌కు రూ. 14 వేలు విలువైన ఎల్‌ఈడీ టీవీని అందజేశారు. ఆయన మాట్లాడుతూ ఖైదీల మానసిక ప్రశాంతత కోసం, వారి ప్రవర్తనలో మార్పు కోసం తనవంతుగా టీవీ వితరణ చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో సబ్ జైల్ సిబ్బంది పాల్గొన్నారు.

అమ్మవారికి అభిషేకాలు


హోమాలు నిర్వహిస్తున్న దృశ్యం

పెద్దతిప్పసముద్రం : స్థానిక శ్రీ పార్వతీ సమేత విరూపాక్షేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం సనగరం పట్టాభిరామయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పార్వతీ అమ్మవారికి, లక్ష్మీ అమ్మవారికి అభిషేకాలతో పాటు శ్రీసూక్త లలితా హోమం, పూర్ణాహుతి, మహా మంగళహారతి కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు అమ్మవారి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు.

నాటుసారా తయారు చేసినా, అమ్మినా చర్యలు


నాటుసారా ఊటను ధ్వంసం చేస్తున్న పోలీసులు

తంబళ్లపల్లె : మండలంలో ఎవరైనా నాటుసారా తయారు చేసినా, అమ్మకాలు సాగించినా కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ లోకేషరెడ్డి హెచ్చరించారు. మంగళవారం కోటకొండ ఎగువ, దిగువ తాండాల పరిసర ప్రాంతాలలో సారా తయారీ స్థావరాలపై పోలీస్‌సిబ్బందితో దాడులు నిర్వహించారు. సారా వండేందుకు సిద్ధం చేసిన సుమారు 800 లీటర్ల ఊటను ధ్వంసం చేశారు.

నేడు జగనన్నకు చెబుదాం

తంబళ్లపల్లె : ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో బుధవారం ఉదయం 10 గంటలకు జగనన్నకు చెబుదాం కార్యక్రమం జరుగుతుందని తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీవో సురేంద్రనాథ్‌లు తెలిపారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ గిరీశం పీఎస్, ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి, జిల్లా ఉన్నతాధికారులు హాజరవుతారన్నారు. ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురావచ్చున్నారు. ప్రజలు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు.

డిపో కార్యాలయం ఎదుట ఎన్‌ఎంయు ధర్నా


డిపో కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న ఎన్‌ఎంయు నాయకులు

మదనపల్లె సిటీ : ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మంగళవారం ఎన్ఎంయు ఆధ్వర్యంలో స్థానిక టు డిపో కార్యాలయం ఎదుట ఎర్రబ్యాడ్జీలు ధరించి ధర్నా చేశారు. సీసీఎస్ రాష్ట్ర సభ్యుడు వినోద్‌బాబు మాట్లాడుతూ ఆర్టీసీ ఉద్యోగులకు ఈహెచ్ఎస్ నుంచి మినహాయింపు చేసి సంస్థలో ఇదివరకే ఉన్న పరిమితి లేని వైద్యాన్ని కొనసాగించాలన్నారు. రద్దు చేసిన సర్వీసులను పునరుద్ధరించి ప్రజలకు అసౌకర్యం లేకుండా ఉద్యోగులకు ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎంయు నాయకులు చలపతి, అమర్‌నాథ్, రమణ, బావాజాన్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన డీఎస్పీ


నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌లో రికార్డులు పరిశీలిస్తున్న మదనపల్లె డీఎస్పీ కేశప్ప

నిమ్మనపల్లె : నిమ్మనపల్లె పోలీస్ స్టేషన్‌ను మదనపల్లె డీఎస్పీ కేశప్ప మంగళవారం తనిఖీ చేశారు. స్టేషన్‌కు చేరుకున్న ఆయన రికార్డులు పరిశీలించారు. వివిధ కేసుల దర్యాప్తు వివరాలు అడిగి తెలుసుకున్నారు. పోలీస్ సిబ్బందికి విధి నిర్వహణపై పలు సూచనలు చేశారు. రాత్రివేళ గస్తీలు ముమ్మరం చేయాలన్నారు. కర్ణాటక మద్యం, సారా అక్రమరవాణా, విక్రయాలపై, అసాంఘిక కార్యకలాపాలపై నిఘా ఉంచాలన్నారు. రోడ్డుభద్రతపై ప్రత్యేక డ్రైవ్ నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రామకృష్ణ, పోలీస్‌సిబ్బంది పాల్గొన్నారు.

రాజకీయాలకతీతంగా సంక్షేమ లబ్ధి

పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


సంక్షేమ పథకాల బుక్‌లెట్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

కలికిరి : వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో కుల, మత, రాజకీయాలకతీతంగా ప్రతి గడపకు సంక్షేమ లబ్ధి చేకూరుతోందని పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామ సచివాలయ పరిధిలో ఎమ్మెల్యే ఆధ్వర్యంలో మంగళవారం గడప గడపకూ కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే చింతల గుట్టపాళెం గ్రామంలోని యల్లంపల్లి, కుమ్మరపల్లి, జంగంపల్లి, జంగంపల్లి హరిజనవాడలలో ఇంటింటికి పర్యటించి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి ఇంటికి అందిన లబ్ధి వివరాలతో కూడిన బుక్‌లెట్‌ను అందజేశారు. సంక్షేమ పథకాలు అందుతున్న తీరు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగుల పనితీరుపై ప్రజలను విచారించి, సమస్యలపై ఆరా తీశారు. ఒంటరి మహిళలకు రేషన్ కార్డులు, వృద్ధాప్య, దివ్యాంగ పింఛన్లు, సిమెంటు రోడ్లు, విద్యుత్ స్తంభాల ఏర్పాటు, ఆరోగ్యశ్రీ తదితరాలపై వచ్చిన వినతులను ఎమ్మెల్యే అక్కడికక్కడే సంబంధిత శాఖల అధికారులకు తెలియజేశారు. త్వరితగతిన పరిష్కార చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

గ్రామ స్వరాజ్యం సీఎం జగన్‌మోహన్ రెడ్డితోనే..

జాతిపిత గాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి తీసుకువచ్చారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. మండలంలోని గుట్టపాళెం గ్రామకస్బాలో నూతనంగా రూ.21.8 లక్షలతో నిర్మించిన రైతు భరోసా కేంద్రం, రూ.35లక్షల వ్యయంతో నిర్మించిన గ్రామ సచివాలయం, ఎంపీ ల్యాడ్స్ నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన వాటర్‌ప్లాంట్, యల్లంపల్లిలో రూ.5లక్షలతో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్, అలాగే యల్లంపల్లిలో రూ.6.5లక్షలు మండల పరిషత్ నిధులో ఏర్పాటు చేసిన వాటర్ ప్లాంట్‌లను ఎమ్మెల్యే చేతుల మీదుగా ప్రారంభించారు. ఆయా కార్యక్రమాలలో మార్క్‌ఫెడ్ మాజీ చైర్మన్ నల్లారి తిమ్మారెడ్డి, ఎంపీపీ నూర్జహాన్, సర్పంచ్ ఆర్.వెంకటరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్‌కుమార్‌రెడ్డి, మండల ప్రత్యేక ఆహ్వానితుడు రత్నశేఖర్‌రెడ్డి, తహసీల్దారు భాగ్యలత, ఎంపీడీఓ గంగయ్య, వైస్ ఎంపీపీ శ్రీకాంత్, నాయకులు మధురెడ్డి, ద్వారకనాథరెడ్డి, ఆర్.మధుసూదన్‌రెడ్డి, ప్రసాద్ రెడ్డి, మల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేడు గడప గడపకూ మన ప్రభుత్వం

కలికిరి : మండలంలోని టి.సంగ్రావారిపల్లి గ్రామ పంచాయతీలో పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో బుధవారం ఉదయం 7 గంటలకు గడప గడపకూ మన ప్రభుత్వం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్ కుమార్ రెడ్డి తెలిపారు. టి.సంగ్రావారిపల్లి, తొగటపల్లి, కంభంవారిపల్లి, దూదేకులపల్లిలో ఎమ్మెల్యే ఇంటింటికి పర్యటిస్తారన్నారు. కార్యక్రమానికి అన్ని శాఖల అధికారులు, సచివాలయ ఉద్యోగులు, వైఎస్సార్‌సీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు హాజరవ్వాలని ఆయన కోరారు.

లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరం

ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ


మాట్లాడుతున్న ఆర్డీఓ మురళీ, డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ తదితరులు

మదనపల్లె : లింగ నిర్ధారణ పరీక్షలు చట్టరీత్యా నేరమని ఆర్డీఓ ఎం.ఎస్.మురళీ అన్నారు. మంగళవారం సబ్ కలెక్టరేట్‌లో గర్భస్థ పిండ పరీక్ష ప్రక్రియ నియంత్రణ దుర్వినియోగ నివారణచట్టం(పీసీపీఎన్‌డీటీ యాక్ట్)పై సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్ఓ లక్ష్మీ, సీడీపీఓ సుజాత, వైద్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ పీసీపీఎన్‌డీటీ యాక్ట్ గురించి క్షేత్రస్థాయిలో మండలస్థాయి అధికారులు ఎంపీడీఓలు, తహసీల్దార్‌లు, ప్రాజెక్ట్ అధికారులు, గ్రామ,వార్డు సచివాలయ సిబ్బంది, పోలీసులు అవగాహన కల్పించాలన్నారు. అదేవిధంగా డివిజన్‌లోని గైనకాలజిస్టులు ఎంటీపీ లైసెన్స్ తప్పనిసరిగా పొందాలన్నారు. గర్భం దాల్చిన తర్వాత నాలుగు నెలల నుంచి ఆరునెలల వరకు వారిని పరీక్షించాలని, తరచుగా అబార్షన్‌లు చేయించుకుంటున్న గర్భిణులపై ఆరోగ్యసిబ్బంది నిఘా ఉంచాలన్నారు. ముఖ్యంగా అంతర్‌రాష్ట్ర సరిహద్దు గ్రామాల్లో చిన్నవాహనంలో స్కానింగ్ మెషిన్ తీసుకువచ్చి, లింగ నిర్ధారణ జరుపుతున్నారన్న ఫిర్యాదు తమ దృష్టికి వచ్చిందని, దీనిపై పోలీసులను నిఘా పెట్టాల్సిందిగా ఆదేశించారు. ప్రతి 1,000మంది పురుషులకు 903 మంది స్త్రీలు మాత్రమే ఉన్నారని, చాలామంది స్కానింగ్ సెంటర్లలో లింగనిర్ధారణ చేయించుకుని ఆడబిడ్డ అయితే అబార్షన్లు చేయిస్తున్నారన్నారు. ప్రభుత్వం 1994 చట్టం ప్రకారం ఎవరైనా లింగనిర్ధారణ పరీక్షలు చేసే డాక్టర్లు, ప్రోత్సహించేవారిని మొదటిసారి తప్పుచేస్తే రెండేళ్లు జైలుశిక్ష, రూ.10వేల జరిమానా, రెండోసారి చట్టాన్ని అతిక్రమిస్తే ఐదేళ్ల జైలుశిక్ష, రూ.50వేల జరిమానా విధిస్తారని తెలిపారు.

సమస్యలపై అంగన్‌వాడీల ధర్నా


బి.కొత్తకోటలో ధర్నా చేస్తున్న అంగన్‌వాడీలు

బి.కొత్తకోట : తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ మంగళవారం అంగన్‌వాడీ కార్యకర్తలు బి.కొత్తకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. గ్రాట్యూటీ అమలు, మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చడం, చనిపోయిన ఉద్యోగుల కుటుంబంలో ఒకరికి ఉద్యోగ కల్పన తదితర డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ నినాదాలు చేశారు. సీఐటీయూ జిల్లా గౌరవ అధ్యక్షుడు శ్రీనివాసులు, అంగన్‌వాడీల సంఘం జిల్లా కార్యదర్శి రాజేశ్వరీ, ఏఐటీయూసీ జిల్లా కోశాధికారి సలీంబాషా తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి

తంబళ్లపల్లె : అంగన్‌వాడీ ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ యూనియన్ నాయకురాలు కరుణశ్రీ, సులోచన, ఉమాదేవి, స్వరూపలు కోరారు. మంగళవారం ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం ముందు రాష్ట్ర సంఘం పిలుపు మేరకు సీఐటీయూ, ఐఎఫ్‌టీయూ యూనియన్‌ల ఆధ్వర్యంలో ధర్నా చేశారు. వేతనాలు, రిటైర్డ్ బెనిఫిట్ రూ.5 లక్షలు, పెన్షన్, వేతనంతో కూడిన మెడికల్‌శెలవు కల్పించాలన్నారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని సీడీపీవో నాగవేణికి అందజేశారు.

పేదల సంక్షేమమే పరమావధి

మదనపల్లె : పేదల సంక్షేమమే పరమావధిగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అనేక పథకాలు అమలుచేస్తున్నారని కురవంక ఎంపీటీసీ బెల్లె హారతి అన్నారు. మంగళవారం మండలంలోని కురవంక పంచాయతీలో వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కురవంక గ్రామసచివాలయ పరిధిలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కోసం ప్రభుత్వం వెచ్చించిన నిధుల వివరాలతో కూడిన బోర్డును ఆవిష్కరించారు. ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన సమావేశంలో ఆంధ్రప్రదేశ్‌కు జగనే ఎందుకు కావాలంటే బ్రోచర్స్‌ను ఆవిష్కరించి, వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన సంక్షేమం, అభివృద్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో బీసీ నాయకులు బెల్లె రెడ్డిప్రసాద్, వైఎస్సార్‌సీపీ కన్వీనర్ లాలూసాహెబ్, కనకన్న, భువుత్‌జాన్, వార్డు మెంబర్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

తపాలా ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


నిరసన తెలుపుతున్న తపాలా ఉద్యోగులు

పీలేరు రూరల్ : తపాలా ఉద్యోగుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఆలిండియా గ్రామీణ డాక్ సేవక్స్ యూనియన్ (ఏఐజీడీఎస్‌యూ) పీలేరు డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్. ఖాదర్‌బాషా, ఎస్. మస్తాన్ అన్నారు. మంగళవారం స్థానిక తపాలా కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ సివిల్ సర్వెంట్ హోదా వెంటనే ఇవ్వాలన్నారు. కమలేష్ చంద్ర కమిటీ సిఫార్సు చేసిన బంచింగ్ అమలు చేయాలని తెలిపారు. జీడీఎస్ కాంట్రిబ్యూషన్ 10 శాతం, డిపార్ట్‌మెంట్ 10 శాతం కాంట్రిబ్యూషన్, తాత్కాలిక పెన్షన్ ఇవ్వాలన్నారు. టార్గెట్స్, మేళాల రూపంలో జీడీఎస్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న అన్నిరకాల వేధింపులను ఆపివేయాలన్నారు. కార్యక్రమంలో కోశాధికారి రాధాకృష్ణ, యూనియన్ నాయకులు సాదిక్‌బాషా, సతీష్, చైతన్య, అబ్బన్న, సయ్యద్‌బాషా, హేమ తదితరులు పాల్గొన్నారు.

వ్యాక్సిన్ సర్వేని పూర్తి చేయండి


సమావేశంలో ప్రసంగిస్తున్న డాక్టర్ జవహర్‌బాబు

కలకడ : బిసిజి వ్యాక్సిన్‌ను 15వ తేదీలోపు పూర్తి చేయాలని డాక్టర్ జవహర్‌బాబు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎర్రకోటపల్లె పీహెచ్‌సీ లో ఆశ డే సందర్భంగా ఆశ, ఆరోగ్య కార్యకర్తలతో సమావేశం ఏర్పాటు చేసి ప్రసంగించారు. మిషన్ ఇంద్రధనస్సు కార్యక్రమంలో భాగంగా పూర్తి సర్వేను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఆదేశించారు. వర్షాకాలంలో నీటినిల్వ ఎక్కువకాలం లేకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేయాలని సిబ్బందిని ఆదేశించారు. బాలింతలకు 3, 7, 14, 21, 28, 32, 42 రోజులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేసుకొని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఈఓ జయరామయ్య, ఆరోగ్యసిబ్బంది భారతమ్మ, షరీఫ్‌బాషా, రోజ, సులోచన, గోపీక్రిష్ణ, రాణి, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

‘ఆడుదాం ఆంధ్రా’లో నమోదు చేసుకోండి


క్రీడా కిట్లను సరఫరా చేస్తున్న ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్

వాల్మీకిపురం : యువత, గ్రామీణుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఆడుదాం ఆంధ్రా పేరిట క్రీడా పోటీలను నిర్వహిస్తోందని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ తెలిపారు. క్రీడా పోటీలకు సంబంధించిన కిట్లు మంగళవారం మండలానికి సరఫరా అయ్యాయి. వాలీబాల్, బ్యాడ్మింటన్, క్రికెట్, కబడ్డీ, ఖోఖోకు సంబంధించిన కిట్లు వచ్చినట్లు తెలిపారు. అధికారులు వాటిని మండలంలో ఉన్న సచివాలయాల సిబ్బందికి అందజేశారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ పాండురంగన్, పంచాయతీ కార్యదర్శి వెంకటరమణ, క్రాంతి, సుమియా తదితరులు పాల్గొన్నారు.

విజయవంతం చేయండి

పీలేరు : ఆడుదాం ఆంధ్రాను విజయవంతం చేయాలని జెడ్పీ కో-ఆప్షన్ సభ్యుడు షఫీ అన్నారు. మంగళవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీలేరు, కేవీపల్లె, కలకడ, గుర్రంకొండ, కలికిరి, వాల్మీకిపురం మండలాలకు సంబంధించి పీఈటీలు, పీడీలు, డీఏలు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ నెల 15 నుంచి 21 వరకు క్రీడా పోటీలు జరుగుతాయన్నారు. కబడ్డీ, క్రికెట్, వాలీబాల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. కోఆర్డినేటర్ రవీంద్రనాథ్ మాట్లాడుతూ పోటీలకు సంబంధించి యాప్ ద్వారా స్కోరింగ్ ఎలా నమోదు చేయాలో పూర్తి స్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ మురళీమోహన్‌రెడ్డి, ఎంఈఓలు లోకేశ్వర్‌రెడ్డి, ఈఓ ప్రసాద్‌రెడ్డి, రైతు అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రక్తదానానికి ముందుకు రావాలి


రక్తదానం చేస్తున్న రియలన్స్ సిబ్బంది

మదనపల్లె సిటీ : రక్తదానం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలని హెల్పింగ్‌మైండ్స్ సంస్థ వ్యవస్థాపకుడు అబూబకర్‌సిద్దిక్ అన్నారు. మంగళవారం స్థానిక రియలన్స్‌మార్ట్‌లో ప్రపంచ రిటైల్ దినోత్సవం పురస్కరించుకుని రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చన్నారు. సంస్థ సిబ్బంది 22 మంది రక్తదానం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో రిలయన్స్ అసిస్టెంట్ స్టోర్ మేనేజర్ భాస్కర్, సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధి నిరోధక టీకాలతో ఆరోగ్యం


వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డాక్టర్ సాయిశిరీషా

కేవీపల్లె : వ్యాధి నిరోధక టీకాలతోనే బిడ్డల ఆరోగ్య సంరక్షణ సాధ్యమని డాక్టర్ సాయిశిరీషా అన్నారు. మంగళవారం కమ్మపల్లెలో నిర్వహించిన వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆమె తనిఖీ చేశారు. అనంతరం మాట్లాడుతూ ప్రభుత్వ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమ మార్గ నిర్దేశకాల ప్రకారం వారి వయస్సుకు తగిన విధంగా టీకాలు వేయాలని సూచించారు. ఈ నెల 16 నుంచి గ్రామాల్లో ప్రత్యేక వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. టీకాలతో పోలియో, క్షయ, కంఠసర్పి, కోరింత దగ్గు, ధనుర్వాతం, హెపటైటిస్, మీజిల్స్, మెదడువాపు, రొటా వైరల్, న్యూమోనియా వ్యాధుల నుంచి రక్షించుకోవచ్చునని చెప్పారు. కార్యక్రమంలో పీహెచ్ఎస్ రమాదేవి, ఆరోగ్య పర్యవేక్షకురాలు గీతారాణి పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటుకు సర్పంచ్ విరాళం


బలిజ జేఏసీ కమిటీ సభ్యులకు విరాళాన్ని అందిస్తున్న కురవంక సర్పంచ్ చలపతి

మదనపల్లె : బలిజ జేఏసీ ఆధ్వర్యంలో మండలంలోని బసినికొండ బైపాస్‌రోడ్డు శ్రీకృష్ణదేవరాయ సర్కిల్‌లో ఏర్పాటు చేస్తున్న విగ్రహానికి కురవంక వైఎస్సార్‌సీపీ సర్పంచ్ చిప్పిలి చలపతి రూ.1.25 లక్షలు విరాళాన్ని అందజేశారు. మంగళవారం జేఏసీ కమిటీ సభ్యులు విగ్రహ ఆవిష్కరణ మహోత్సవ ఆహ్వానపత్రికను సర్పంచ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన జేఏసీ కమిటీ సభ్యులను అభినందిస్తూ, మహోత్సవానికి తనవంతు విరాళంగా నగదును అందించారు. కార్యక్రమంలో మాజీ టౌన్‌బ్యాంక్ వైస్‌చైర్మన్ మహర్షి(భాస్కర్‌కుమార్), కూరాకుల ఆంజనేయకుమార్, ఆకుల కృష్ణమూర్తి, బోర్‌వెల్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలి

తంబళ్లపల్లె : పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులు ప్రజా సమస్యలపై వెంటనే స్పందించాలని ఎంపీడీవో సురేంద్రనాథ్ ఆదేశించారు. ఎంపీడీవో కార్యాలయంలో మంగళవారం సమీక్ష సమావేశం జరిగింది. పంచాయతీ కార్యదర్శులు గ్రామాలలో తిరిగినప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయన్నారు. గుర్తించిన సమస్యలను వెంటనే పరిష్కరించేందుకు చొరవ చూపాలని, క్లిష్టసమస్యలు ఉంటే ఉన్నతాధికారులకు తెలియజేయాలన్నారు. వారి సూచనల మేరకు పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో ఏవో ఆనంద్ కుమార్, పంచాయతీ కార్యదర్శులు, గ్రామసచివాలయ డిజిటల్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

కేంద్ర పథకాలపై అవగాహన పెంచాలి


సమావేశంలో ప్రసంగిస్తున్న సాయిలోకేష్

కలకడ : కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలపై ప్రతి ఒక్కరిలో అవగాహన పెంచాలని దేశ సురక్షిత పాలన బీజేపీకే సాధ్యమని బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ అన్నారు. మంగళవారం కలకడ బాలాజీ రెసిడెన్సీలో పీలేరు నియోజకవర్గ కన్వీనర్ పొత్తూరి శ్రీకాంత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అభిమానులు, పార్టీ కార్యకర్తల సమావేశంలో పాల్గొని ప్రసంగించారు. గెలుపు, ఓటమి అనే అంశం పక్కన పెట్టి రాష్ట్రవ్యాప్తంగా అన్ని అసెంబ్లీ, పార్లమెంట్ స్థానాలలో పోటీచేసే అభ్యర్థులపై కసరత్తు చేస్తున్నారని చెప్పారు. సమష్టి కృషితో పార్టీ కార్యకర్తలను కాపాడుకుని ఓటింగ్ శాతం పెంచేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి చంద్రమౌళి, చిత్తూరు జిల్లా అధ్యక్షుడు రఘురామిరెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి, కో-కన్వీనర్ వెంకటరమణ, మండలశాఖ అధ్యక్షుడు ఆంజినేయులు, నటరాజ్, శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాంపస్ ఇంటర్వ్యూలో 26మంది ఎంపిక


ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులతో కరస్పాండెంట్ డాక్టర్ ఆర్.గురుప్రసాద్, సిబ్బంది

మదనపల్లె : పట్టణంలోని శ్రీజ్ఞానాంబిక డిగ్రీ కళాశాలలో నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూలో 26మంది విద్యార్థులు ఉద్యోగాలకు ఎంపికయ్యారని కరస్పాండెంట్ డాక్టర్ రాటకొండ గురుప్రసాద్ తెలిపారు. మంగళవారం చెన్నైకి చెందిన సదర్‌ల్యాండ్ సంస్థ ప్రతినిధులు కళాశాలలో క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 45మంది బీసీఏ, బీఎస్సీ విద్యార్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా, అందులో ప్రతిభ కనబరిచిన 26మంది విద్యార్థులను ప్రోగ్రాం అసోసియేట్ ఉద్యోగాలకు ఎంపిక చేశారు. వీరికి వార్షిక వేతనం కింద రూ.3లక్షలు అందించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.రమాదేవి, హెచ్ఆర్ గిరీష్, అధ్యాపకుడు మౌలాలి పాల్గొన్నారు.

ఎన్నికలకు సన్నద్ధం కండి

కురబలకోట : రానున్న ఎన్నికలకు బీజేపీ శ్రేణులు సన్నద్ధం కావాలని బీజేపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్ తెలిపారు. మంగళవారం అంగళ్లులో జరిగిన క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రభుత్వం అమలు చేసిన పథకాల గురించి గ్రామ గ్రామానా ప్రజలకు వివరించాలన్నారు. పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలన్నారు. నియోజకవర్గంలో త్వరలో కేంద్ర రాష్ట్ర నాయకులతో సమావేశం నిర్వహిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో నాయకులు, కార్యకర్తలతో పాటు బూత్ కమిటీలు క్రియాశీలకంగా పని చేయాలన్నారు.

ఈవీఎంల పనితీరుపై అవగాహన


ఈవీఎంల పనితీరుపై అవగాహన కల్పిస్తున్న ఎంఈఓ ఎం.ఆర్.పద్మావతి

నిమ్మనపల్లె : ఈవీఎంల పనితీరుపై ఎంఈఓ ఎం.ఆర్.పద్మావతి అవగాహన కల్పించారు. మంగళవారం మండలంలోని తవళం, నిమ్మనపల్లె, అడుసుపల్లె, కొండయ్యగారిపల్లె పోలింగ్ కేంద్రాలకు వెళ్లి స్థానిక ప్రజలు, నాయకులకు, ఈవీఎంలు పని చేసే విధానంపై మాక్‌పోలింగ్ నిర్వహించారు. ఓటు ఎలావేయాలి. ఓటు నిర్ధారణ గురించి వివరించారు. ఈవీఎంలపై ఎలాంటి సందేహాలు ఉన్నా నివృత్తి చేసుకోవచ్చన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటుహక్కు పొందాలన్నారు. ప్రతి ఓటరు ఈవీఎంల పనితీరుపై అవగాహన కలిగి ఉండాలన్నారు. కార్యక్రమంలో డీటీ సిరాజుద్దీన్, సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

17న శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ


శ్రీకృష్ణదేవరాయల విగ్రహావిష్కరణ ఆహ్వాన పత్రికలు ఆవిష్కరిస్తున్న బలిజ జేఏసీ సభ్యులు

మదనపల్లె : బలిజ జేఏసీ మదనపల్లె ఆధ్వర్యంలో పుంగనూరు రోడ్డు, బసినికొండ బైపాస్‌రోడ్డు శ్రీ కృష్ణదేవరాయల సర్కిల్‌లో ఈనెల 17న శ్రీ కృష్ణదేవరాయల కాంస్య విగ్రహావిష్కరణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జేఏసీ అధ్యక్షుడు వైఎస్ మునిరత్నం, కార్యవర్గసభ్యులు తెలిపారు. మంగళవారం బసినికొండ శ్రీ కృష్ణదేవరాయసర్కిల్‌లో విగ్రహావిష్కరణ మహోత్సవ ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17వ తేదీ ఆదివారం ఉదయం 10 గంటలకు జరిగే ఈ కార్యక్రమానికి రాష్ట్ర అటవీ, విద్యుత్, భూగర్భగనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి, కర్ణాటక కైవారం శ్రీక్షేత్రం, నారాయణయోగిమఠం ధర్మాధికారులు ఎం.ఆర్.జయరామయ్య, ఎమ్మెల్యే నవాజ్‌బాషా, చిత్తూరు ఎమ్మెల్యే జేఎంసీ శ్రీనివాసులు, రాష్ట్ర కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపాశేషు, టీటీడీ బోర్డు మాజీ మెంబర్ పోకల అశోక్‌కుమార్ ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. శ్రీకృష్ణదేవరాయల కాంస్య విగ్రహాన్ని బసినికొండ మాజీ సర్పంచ్ కత్తి కృష్ణమూర్తి, మండల ఆర్‌బీకే చైర్మన్ కత్తి రాజకిషోర్‌చంద్రదేవ్, సవరాల కృష్ణమూర్తి, లక్ష్మీదేవమ్మ దంపతులు వితరణ చేశారన్నారు. కార్యక్రమంలో బలిజ జేఏసీ కమిటీ సభ్యులు రేగడ ప్రసాద్‌కుమార్, ఎస్.భాస్కర్(మహర్షి), బొంతల జయరాం, ఆకుల కృష్ణమూర్తి, అండే శివప్రసాద్, కూరాకుల ఆంజనేయకుమార్, బోర్‌వెల్ నాగరాజ తదితరులు పాల్గొన్నారు.

• పొగమంచు చాటున..



మండల కేంద్రంలో పొగమంచు పంజా విసిరింది. మంగళవారం వేకువజాము నుంచే దట్టమైన పొగమంచు పట్టణాన్ని, ఎన్‌హెచ్ 340 జాతీయ రహదారిని కప్పేసింది. ఉదయం 8 గంటల వరకు పట్టణంలోని వీధులన్నీ పొగమంచుతో నిండిపోయాయి. చల్లని వాతావరణంతో కూడిన పొగమంచును జనం ఆస్వాదించారు. పట్టణ పరిసరాల్లోని జాతీయ రహదారిపై కూడా పొగమంచు నిండిపోవడంతో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. పగటి పూటే వాహనాలు లైట్లు వేసుకొని వెళ్లారు. చలి కూడా ఎక్కువ ఉండటం గమనార్హం.

– గుర్రంకొండ